క్లుప్తంగా

నేత్రదానం



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న సంఘం బాధ్యులు

సత్తుపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వనమారెడ్డి చెంచిరెడ్డి సతీమణి భారతి ఇటీవల మృతి చెందగా ఆమె నేత్రాలను లయన్స్‌క్లబ్ ద్వారా ఖమ్మం నేత్రనిధికి అందించారు. ఆదివారం సత్తుపల్లిలో జరిగిన సంతాప సభలో టీఎస్‌జీఆర్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు కల్యాణం కృష్ణయ్య, రాష్ట్ర కార్యదర్శి శరత్ బాబులు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘం ద్వారా నేత్రదానం, అవయవ దానాలకు దాతలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు కేశవరెడ్డి, బద్రుద్దీన్, రామిశెట్టి సుబ్బారావు, కృష్ణయ్య, మధుసూదన్‌రాజు, ప్రకాశరావు, మురళీ, బాబు, దాసరి వెంకట్రామిరెడ్డి, పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.

27 నుంచి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు



మాట్లాడుతున్న డీఎం

సత్తుపల్లి: ఈ నెల 27 నుంచి సత్తుపల్లి నుంచి ఐదు పుణ్యక్షేత్రాలకు భక్తుల కోసం ప్రత్యేక డీలక్స్ బస్సు నడుపుతున్నట్లు సత్తుపల్లి ఆర్టీసీ డీఎం యు.రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె మాట్లాడుతూ.. 27న తెల్లవారుజామున 4 గంటలకు సత్తుపల్లి నుంచి డీలక్స్ బస్సు బయలుదేరి అదే రాజు రాత్రి 10 గంటలకు ఐదు పుణ్యక్షేత్రాలను దర్శించుకొని తిరిగి చేరుకుంటుందన్నారు. ముందుగా మద్ది ఆంజనేయస్వామి ఆలయం తర్వాత ద్రాక్షారామంలోని భీమేశ్వరస్వామి ఆలయం, కొనసీమ తిరుపతిగా పేరొందిన వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు పెనుగొండలోని కన్యకపరమేశ్వరస్వామి ఆలయం, చిన్నతిరుపతి(ద్వారకాతిరుమల) పుణ్యక్షేత్రాలను దర్శింప చేయనున్నట్లు తెలిపారు. ఈ బస్సు ఛార్జీ పెద్దలకు రూ.1,000, పిల్లలకు రూ.700, దేవాలయాలలోని ఇతర టిక్కెట్లు, ఖర్చులు భక్తులే భరించాలన్నారు. వివరాలకు 9866619189 సంప్రదించాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్లు

చింతకాని: మండలంలోని లబ్ధిదారులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన బొగ్గారపు వెంకటనారాయణ, నిమ్మకాయల వెంకయ్య, తూము భద్రయ్య లకు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సిఫారసు మేరకు మంజూరైన రూ.1.26 లక్షల విలువైన చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మడుపల్లి భాస్కర్, కన్నెబోయిన గోపి, యండపల్లి శ్రీనివాసరావు, షేక్ అబ్దుల్ మజీద్, దేశబోయిన వెంకటేశ్వర్లు, షేక్ ఖాసీం, చెరుకుపల్లి రాంబాబు, ఉసికల సైదులు, మాతంగి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు..



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న నాయకులు

తల్లాడ: మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 13 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కాపా సుధాక ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుండేటి కృష్ణారెడ్డి, గుండ్ల వెంకటేశ్వర్లు, తేళ్లూరి బాలక్రిష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాగంటి మృతి పార్టీకి తీరని లోటు

సత్తుపల్లి: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గోపినాథ్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

అవగాహన లేక.. దరిచేరదాయె..

నీరుగారిపోతున్న పశువుల షెడ్డు నిర్మాణ పథకం

- నిబంధనలు తెలియక పశుపోషకుల ఇబ్బందులు
- నిధులున్నా.. చేరుకోని లక్ష్యం



షెడ్డు నిర్మాణం కొలతలు వేస్తున్న ఈజీఎస్ సిబ్బంది (ఫైల్)

ముదిగొండ: ఏ పథకమైన అవగాహనతో పాటు ప్రచారం కల్పిస్తే వాటి వినియోగం తెలుస్తుంది.. కానీ రైతులకు, పశుపోషకులకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ఓ పథకం ఉన్న సంగతి పూర్తి స్థాయిలో అవగాహన లేక పథకం అబాసుపాలవుతోంది. నిబంధనలు సవాలక్ష ఉన్నా కనీసం ఈ పథకంపై అవగాహన కల్పించే వారు లేక పశుపోషకులు ఆరుబయటనే పశువులను ఉంచుతున్నారు. ప్రభుత్వం నుంచి పుష్కలంగా నిధులున్నా గ్రామీణ ప్రాంత వాసులకు తెలియట్లేదు. పశువుల పాకలు (షెడ్డులు) ఉపాధిహామీ పథకంలో భాగంగా అమలవుతున్న నిర్మాణాలకు వర్తిస్తుంది. ఇది పాత పథకమైనా, చెప్పేవారు లేక అవగాహన రాహిత్యంతో దరఖాస్తులే తక్కువగా వస్తున్నాయనుకుంటే అందులో పనులు ప్రారంభిస్తున్నవి, పూర్తవుతున్నవి పదుల సంఖ్యలో కూడా లేక లక్ష్యం నెరవేరడం లేదు. 2023–24 ఆర్థిక సంవత్సరంలోని పథకం ముందుకు సాగక ఎక్కక వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసి హెచ్చరించినా పరిస్థితిలో మార్పు రావట్లేదు.

ఇందిరాడెయిరీకి ఆద్యం పోసేలా..

మధిర నియోజకవర్గంలో పశువుల షెడ్డు ముందుకు సాగక పథకం లబ్ధిదారుల దరిదాపుల్లోకి రావడం లేదు. ప్రతీ మహిళను ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా, ప్రయోగాత్మకంగా ప్రవేశపెడుతున్న ఇందిరాడెయిరీ పథకానికి ఈ పథకం ఆద్యం పోసేలా ఉంటుంది. కానీ అలాంటి పథకానికి సంబంధించి పశుపోషకులకు అవగాహన రాహిత్యంతో షెడ్డుల నిర్మాణాలకు నిబంధనల పేరుతో ముందుకు సాగడం లేదు. ఇలా నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఇదే పరిస్థితి నెలకొంది. ముదిగొండ మండలంలో 90 షెడ్లుకు మంజూరవ్వగా నిర్మాణ దశలో 30 మాత్రమే ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారుల చొరవతో అవగాహన కల్పించి అవసరమున్న లబ్ధిదారులకు పథకం అమలయ్యే విధంగా చూడాలని పశుపోషకులు కోరుతున్నారు.

సమస్యలు..

అధికారులు ప్రత్యేక దృష్టి సారించకపోవడం, పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడం, ఒకటి రెండు షెడ్లకు పథకం అమలైనా, వాటికి కూలీల వేతనం రూ.1,081 మాత్రమే అందించి, మిగిలిన పైకం షెడ్డు నిర్మాణం పూర్తయ్యాకే అందించడంతో లబ్ధిదారులు ఆసక్తి కనపరచకపోవడం లేదు. దీంతో పాటు రైతులు వ్యవసాయ పనుల్లో బిజీ, బిజీగా ఉంటున్నారు.

నిబంధనలు..

- గ్రామాల్లో ఉపాధి కూలి పనులకు జాబ్ కార్డు ఉంటే షెడ్డు నిర్మాణానికి అర్హత కల్పిస్తారు.
- గ్రామ సభ తీర్మాణం తప్పనిసరి
- పశువుల షెడ్డు నిర్మాణానికి రూ.85 వేలు మంజూరు చేస్తారు.
- అందులో కూలీల వేతనం రూ.1,081, మెటీరియల్ కాంపోనెంట్‌కు రూ.82.400 ఇస్తారు.
- ఐదెకరాలలోపు భూమి ఉండాలి. అందులో మూడు పశువులు, షెడ్డు నిర్మాణానికి స్థలం ఉండాలి.
- ఇవన్నీ పూర్తయ్యాకనే రూ.85వేలు మంజూరు చేస్తారు.

గేదెలున్నాయి.. షెడ్డే లేదు



పశువుల షెడ్డు గురించి అవగాహన లేకనే ఇంటి ముంగు కట్టేసుకుంటున్నాము. ఎండలకు, వానలకు ఇబ్బంది కరంగా ఉంది. స్థలం ఉంది, ఉపాధిహామీ జాబ్‌కార్డు ఉంది. డ్వాక్రా గ్రూపులో సభ్యురాలుగా ఉన్నా, అయినా షెడ్డు నిర్మాణం గురించి తెలియదు. పశువులకు షెడ్డు మంజూరు చేస్తే బాగుంటుంది. అధికారులు అవగాహన కల్పించాలి.

– ఎం.భాగ్యమ్మ, కమలాపురం

ప్రతీ లబ్ధిదారుడికి మంజూరు చేస్తున్నాం..



కొంతమందికి తెలియక పోయినా ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు ద్వారా తెలియజరుస్తున్నాం. ఐకేపీ, ఈజీఎస్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. దరఖాస్తు చేసుకున్న వారికి ఎస్టిమేట్ వేసి మంజూరు చేయించి గ్రౌడింగ్ చేస్తాం.

– ఈజీఎస్ ఏపీఓ రంగనాయకమ్మ, ముదిగొండ

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



వైరారూరల్: మాట్లాడుతున్న వీరభద్రం

వైరారూరల్: యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పులు చేసి ఆర్థికంగా నష్టపోయి దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలకు చేసుకుంటున్నారని యువకులు బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ సూచించారు. చెడు వ్యసనాలు వద్దు, పోరాటాలే ముద్దు అను నినాదంతో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర ఆదివారం మండలంలోని గ్రామాల్లో సాగిన సందర్భంగా ఇరువురు మాట్లాడారు. సత్తనపల్లి నరేష్, గుమ్మా ముత్తారావు, బొడ్డు మధు, గడ్డం విజయ్, రావూలపాటి నాగరాజు, ఎలిజాల గోపినాథ్, కురెల్లి రాకేష్, కురెల్లి ధీరజ్, వేణు తదితరులు ఉన్నారు.



కొణిజర్ల: నాయకుల మానవహారం

కొణిజర్ల: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణ అన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర మండలంలోని చిన్నమునగాల చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామస్తులు, సీపీఎం కార్యకర్తలు సైకిల్ యాత్రకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతల రమేష్, ప్రధాన కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, నాయకులు కుటుంబరావు, అంజయ్య, వెంకటేశ్వర్లు, నరసింహారావు, శివరామకృష్ణ, పురుషోత్తం, ఆశీర్వాదం, నగేష్, కోటేశ్వరరావు, నాగార్జున, మోహనరావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కమిషనర్

మధిర: మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో మహిళా సంఘ సభ్యులకు పారిశుద్ధ్యంపై ఆదివారం మున్సిపాలిటీ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలో ఈనెల 2 నుండి వంద రోజుల అభివృద్ధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా మహిళా సంఘ సభ్యులకు తడి–పొడి చెత్తను వేరు చేసి ఇవ్వడం, ప్లాస్టిక్ నిషేధం వంటి కార్యక్రమాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మెప్మా ఆర్పీ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చేపమందు పంపిణీ

వేంసూరు: మృగశిర కార్తె సందర్భంగా మండల పరిధిలోని కందుకూరులో బండి వెంకటరెడ్డి ఆస్తమా రోగులకు చేపమందు పంపిణీ చేశారు. 30 ఏళ్ల నుంచి చేప మందు పంపిణీ చేస్తున్నారు. ఈ మేరకు కందుకూరు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చి చేప మందు తీసుకెళ్లారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జవాన్‌ను సన్మానిస్తున్న స్నేహితులు

వేంసూరు: వేంసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2007–2008 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని నాటి గురువులను సన్మానించుకున్నారు. భారత్ పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధంలో పాల్గొన్న మహేష్‌ను తోటి స్నేహితులు సన్మానించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బీకే.నరసింహారావు, అప్పటి ఉపాధ్యాయులు శాంత కుమారి, గీతా కుమారి, నిర్మల కుమారి, రామాచారి, పూర్వ విద్యార్థులు మహేష్, రమేష్, హరికృష్ణ, రఫీ, శ్రీలక్ష్మీ, భవని, యాకోబ్, సుప్రియ, అనిత, ఉదయ్ కిరణ్ ఉన్నారు.

గ్రామదేవతలకు వైభవంగా పూజలు



ఏన్కూరు: హోమం చేస్తున్న అర్చకులు, దంపతులు



ఎర్రుపాలెం: జలబిందెలతో వస్తున్న మహిళలు

గంగమ్మ తల్లి జాతర

ఏన్కూరు: మండలపరిధిలోని తూతకలింగన్నపేటలో గంగమ్మ తల్లి జాతరను యాదవులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాల నడుమ చిన్నారులు, మహిళలు, యువతులు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా బయలుదేరి గ్రామదేవతల దగ్గర పూజలు చేశారు. గంగమ్మతల్లి దగ్గర పూజలు చేసి బోనాలు సమర్పించారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు పండాలని పశుసంపద వృద్ధి చెందాలని గ్రామదేవతను వేడుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠ..

ఏన్కూరు మండల పరిధిలోని జన్నారం ఎస్టీకాలనీలో ముత్యాలమ్మ, పోతురాజు, ధ్వజస్తంభం ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు రోజుల నుండి హోమగుండం పూజలు, గణపతి పూజ, విగ్రహాలు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ముత్యాలమ్మ, పోతురాజు ప్రతిష్ఠలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తూతకలింగన్నపేటలో..

గంగానమ్మకు పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగానమ్మ తల్లి జాతర ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. గంగానమ్మ ఆలయ కమిటీ చైర్మన్ జానకి శివయ్య స్థానికుల సహకారంతో పెద్ద ఎత్తున జాతర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారి శివకార్తీక్ శర్మ అమ్మవారిని పట్టువస్త్రాలతో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. మహిళలందరూ అమ్మవారికి జలాభిషేకం చేశారు. మంగళవాయిద్యాలతో పసుపు, కుంకుమ, పూలు పండ్లు, బోనాలను తీసుకొచ్చి సమర్పించారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే రాగమయి



ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్: రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక క్యాంపు కార్యాలయంలో మండలంలోని 23 మందికి రూ.6.47 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, ఎండి.కమల్‌పాషా, చల్లగుండ్ల కృష్ణయ్య, పింగళి సామేలు, తోట సుజలరాణి, రహ్మత్‌పాషా, ఉడతనేని అప్పారావు, గోలి శ్రీనివాసరెడ్డి, షాకీర్, ఇమామ్, డీఎస్ చారి, జాని, శ్రీనివాసరాజు, యూనిస్, అశోక్‌చక్రవర్తి, ఖాజా శ్రీను, ఝాన్సీరాణి, రమేష్, ఖాదర్‌బాబా పాల్గొన్నారు.

కల్వ సుజాతకు సన్మానం..

కల్లూరురూరల్: కల్లూరులో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా ఎంపికైన పసుమర్తి చందర్‌రావు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కల్లూరుకు వచ్చిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాతను ఎమ్మెల్యే మట్టా రాగమయి ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమం అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజాదేవి నివాసంలో నాయకులతో కలిసి సుజాతను కలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గంలో ఆర్యవైశ్య సమస్యలను కార్పొరేషన్ చైర్మన్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దారా రంగ, చిత్తలూరి నరేష్, పోట్ల అర్జున్‌రావు, భాగం ప్రభాకర్‌చౌదరి, బైర్ల కాంతారావు, ఎస్‌కె. బాజీ తదితరులు ఉన్నారు.

అంబరాన్నంటిన సంబురాలు..



తరగతి గదిలో 1983-85 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



1978-1980 బ్యాచ్ పూర్వ విద్యార్థులు..

- వేలాదిమంది పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక
- ఘనంగా జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీ

మధిర: మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఆదివారం జూనియర్ కళాశాల ఆవరణలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికతో కళాశాల ప్రాంగణం కిటకిటలాడింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభించిన 1970వ సంవత్సరం బ్యాచ్ నుంచి 2025 వరకు మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్న విద్యార్థులతో గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాలలో చదివిన వేలాదిమంది విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొని తమ గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు విద్యాబోధన చేసిన అధ్యాపకులను, వివిధ స్థాయిలో స్థిరపడిన పూర్వ విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. బ్యాచుల వారీగా విద్యార్థులు తమ కళాశాల తరగతి గదుల్లో ఫొటోలు దిగి తమ గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ మేరకు 75 మంది పూర్వ విద్యార్థులు 5 కమిటీలు వేసుకొని సుమారు 2 నెలలుగా సమన్వయంతో పనిచేశారు. గోల్డెన్ జూబ్లీ వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించి వేడుకలను విజయవంతం చేశారు.

కాంగ్రెస్‌లోనే మహిళలకు సముచిత గౌరవం



మాట్లాడుతున్న నీరజాదేవి

కల్లూరురూరల్: కాంగ్రెస్ పార్టీలోనే మహిళలకు సముచిత గౌరవం ఉంటుందని కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి స్పష్టం చేశారు. కల్లూరులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... కల్లూరు మహిళా ఎస్సైపై దురుసుగా ప్రవర్తించిన తల్లాడ మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రాయల రాము, తన అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు గౌరవిస్తుందని, ఇలాంటి సంఘటనలను క్షమించదన్నారు. నిందితులను ప్రోత్సహించే అలవాటు పార్టీకి లేదని తప్పు ఎవరు చేసినా చట్ట ప్రకారం శిక్ష పడుతుందన్నారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆళ్లకుంట నర్సింహారావు, లక్కినేని కృష్ణ, బంక బాబు, ఎస్టీ సెల్‌రాష్ట్ర నాయకులు భూక్యా శివకుమార్‌నాయక్, దేవదాయ కమిటీ చైర్మన్ దారా రంగ, నాయకులు ఎస్‌కె.ఉస్మాన్, బాజీ, బాజీ, భాగం ప్రభాకర్‌చౌదరి, తక్కెళ్లపాటి దుర్గా ప్రసాద్, పోట్రు అర్జున్, రావుదామాల రాజు, జిల్లేల్ల కృష్ణారెడ్డి, ప్రముఖ న్యాయవాది, పెద్దబోయిన రామ నర్సింహారావు, ఉప్పల శ్రీనివాసరావు, బైర్ల కాంతారావు, మట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత విషయాన్ని రాజకీయం చేయొద్దు..



మాట్లాడుతున్న నాయకులు

తల్లాడ: రెండు రోజుల క్రితం కల్లూరు పట్టణంలో ఎస్సై హరితపై జరిగిన దాడిని కాంగ్రెస్ పార్టీకీ పూయడం సరైందికాదని, ఇది కొందరి వ్యక్తిగత విషయమని, దీన్ని రాజకీయం చేస్తే ఊరుకోమని కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కాపా సుధాకర్ మాట్లాడుతూ... ఎస్సైపై దాడి చేయడం తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, ఎమ్మెల్యే రాగమయి కూడా ఖండించారని, తప్పు చేసిన వారికి శిక్ష పడుతుందని, అంతేకానీ ఆ గొడవకు ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, నాయకులు జక్కంపూడి కిషోర్, తుమ్మలపల్లి రమేష్, అడపా అనీల్, రావుల గోపయ్య, భూక్యా అంజయ్య, రవీంద్ర, అజయ్, జమాల్ పాల్గొన్నారు.

మృగశిర సందడి..



వైరాలో..

మృగశిర కార్తె ప్రవేశంతో ఆదివారం చేపలు కొనుగోలు చేసేందుకు జనం ఎగబడ్డారు. మృగశిర ప్రారంభం రోజు చేపలు తినడం ఆనవాయితీ కావడంతో చేపల కోసం మత్స్యప్రియులు బారులుదీరారు. ఈ మేరకు చేపల మార్కెట్‌ల వద్ద సందడి నెలకొంది. సాధారణంగా కిలో రూ.150 పలికే చేపల ధర రూ.200 నుంచి రూ.220 వరకు పలికింది. చేపల రకాల బట్టి రేట్లు పలికాయి. రేట్లు పెరిగినా ప్రజలు చేపలు కొనేందుకు ఆసక్తి చూపడంతో విక్రయాలు బాగా జరిగాయి.

– సాక్షి నెట్‌వర్క్



కారేపల్లి: బస్టాండ్ సెంటర్‌లో చేపల విక్రయాలు



తల్లాడలో..



సత్తుపల్లి టౌన్: చేపల విక్రయాలు..